క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పట్టణంలోని టౌన్ ఫీడర్ 1 నిర్వహణ కారణంగా ఆదివారం పట్టణం విద్యుత్ కోత ఉంటుందని టౌన్ 3 ఏఈ భగవంతయ్య శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా మెట్టుగడ్డ, టీచర్స్ కాలనీ, నలంద ఆటో స్టాండ్, అలకొసర్ మజీద్, బీకేరెడ్డి కాలనీ, శేషాద్రినగర్, శ్రీబార్ ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల దాక విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

నవాబుపేట: మండల కేంద్రంతో పాటు యన్మన్‌గండ్ల, కొండాపూర్, గురుకుంట, రుక్కంపల్లి, ధరిపల్లి, హజిలాపూర్ గ్రామాల్లో ఆదివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు. నవాబుపేట సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీ థావుర్యనాయక్ తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందని సహకరించాలని కోరారు.

అదనపు గదులు వెంటనే పూర్తిచేయాలి

కోయిల్‌కొండ: మండల కేంద్రంలో నిర్మిస్తున్న కస్తూర్బాగాంధీ పాఠశాల అదనపు గదులను వెంటనే నిర్మించాలని పంచాయతీరాజ్ డిప్యూటీ ఈఈ రాము సూచించారు. శనివారం మండల కేంద్రంలో పాఠశాల నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ఎన్నికలకోడ్ ఉన్నందున పనులు ప్రారంభం కాలేదని త్వరితగతిన పనులు ప్రారంభించి పూర్తిచేయాలని ఆయన సూచించారు. కాంట్రాక్టర్ నాణ్యతతో నిర్మాణం చేపట్టాలన్నారు.

బాలబాలికలకు క్రీడాపోటీలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక జగ్జీవన్‌రాంనగర్‌లో బాలకృష్ణగౌడ్ ట్రస్టు ఆధ్వర్యంలో బాలబాలికలకు క్రీడాపోటీలు నిర్వహించారు. మొత్తం పది టీంలలో 50 మంది కబడ్డీ, స్కిప్పింగ్, కుర్చీలాట, పరుగుపందెం పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రాములు, సీనియర్ నాయకులు కిల్లె గోపాల్, కురుమూర్తి మాట్లాడుతూ బాలబాలికల్లో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి డి.చంద్రకాంత్, పార్టీ నాయకులు భరత్, ఈశ్వర్, ప్రశాంత, నందు, సీఐటీయూ నాయకుడు రాజ్‌కుమార్, కాంగ్రెస్ నాయకుడు ఆంజనేయులు, క్రీడాకారులు సంతోష్, ప్రభాకర్, అమ్ములు, మానవి, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

కంట్రోలర్ ఇష్టారాజ్యం

నారాయణపేట రూరల్ : జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో కంట్రోలర్ పాయింట్ నిర్వహణ తీరు అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో ప్రయాణికులకు బస్సులు సమయసారిణి తెలియడంలో ఇబ్బందులు తప్పడం లేదు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో ఉదయం షిఫ్టులో ఒకరు, మధ్యాహ్నం షిఫ్టులో మరొకరితోపాటు జనరల్ షిఫ్టుకు ఒక మహిళ అధికారిణిని ఏర్పాటు చేశారు. అయితే ఉదయం 4గంటల నుంచి రాత్రి 9:15గంటల వరకు కంట్రోలర్ పాయింట్ తెరిచి ఉంచి ముగ్గురు వారికి కేటాయించిన సమయానికి విధులు నిర్వహించాల్సి ఉంది. వారిలో ఒకరు ఇటీవల బదిలీపై వెళ్లగా తాత్కాలికంగా కోస్గి డిపోకు చెందిన డీఎస్‌లో ఉన్న డ్రైవర్‌ను వాడుకుంటున్నారు. అయితే తెల్లవారుజామున, రాత్రి వేళలో డ్యూటీలో ఉన్న కంట్రోలర్ సమయపాలన పాటించడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. 4గంటలకు తెరవాల్సిన కాంట్రోలర్ గది 5.30గంటలకు గాని తెరుచుకోవడంలేదని, రాత్రి 8:45లోపే మూసేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఆయా సమయాల్లో ప్రయాణికులకు బస్సుల వివరాలు తెలిపేందుకు ఎవరు అందుబాటులో లేకపోవడంతో డిపో వెద్దకు వెళ్లి సెక్యూరిటీ సిబ్బందిని అడుగుతున్నారు. దీంతో డిపో ఆదాయానికి గండి పడుతుందని డ్రైవర్, కండక్టర్లు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి డీఎం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అదేవిధంగా బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన సమయసారిణి ఫ్లెక్సీలో సైతం సరియైన విధంగా బస్సు సమయాలు లేవని వాపోతున్నారు.

డీఎం వివరణ..

ఈ విషయంపై డీఎం లక్ష్మిసుధను వివరణ కోరగా.. తప్పకుండా సమయపాలన పాటించాలని, లేనిపక్షంలో కంట్రోలర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై విచారణ చేస్తామన్నారు. కంట్రోలర్లు ప్రయాణికులకు బస్సు సమయాలను తెలియజేయాలన్నారు. కంట్రోలర్ పాయింట్‌కు ఫోన్ 7382826293కి చేసి అడగవచ్చన్నారు.

క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

దామరగిద్ద: వేసవి క్రీడా శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఇన్‌చార్జి డీవైఎస్‌ఓ నర్సింహులు, వేసవి శిక్షణ శిబిరాల ఇన్‌చార్జి సాయినాథ్ అన్నారు. శనివారం మండలంలోని కాన్‌కుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా యువజన క్రీడా శాఖ సౌజన్యంతో పీఈటీ వెంకటప్ప ఆధ్వర్యంలో కొనసాగుతున్న వేసవి క్రీడా శిబిరాన్ని సందర్శించారు. ఈ మేరకు.. క్రీడాకారులతో మాట్లాడుతూ.. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో సాధన చేసి నైపుణ్యాన్ని సాధించాలన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయికి చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీడీ ప్రభాకర్, రత్నయ్య, పీఈటీ వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

'పచ్చిరొట్ట'తో భూసారం మెరుగు

- రసాయన ఎరువుల వాడకం తగ్గించేందుకు ప్రత్యామ్నయంగా మారిన వైనం
- రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తున్న ప్రభుత్వం


గతేడాది సాగు చేసిన జీలుగ పంట(ఫైల్)

చిన్నచింతకుంట: అధిక దిగుబడులే లక్ష్యంగా పంటసాగులో విచ్చలవిడిగా రసాయన ఎరువులు వినియోగించడం ఎంతో హానికరమని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. వీటితో దీంతో భూసారం దెబ్బతింటోందని పేర్కొంటున్నారు. క్రమంగా పంటలో సూక్ష్మ, స్థూల పోషకాలు లోపిస్తాయిని హెచ్చరిస్తున్నారు. ఈక్రమంలోనే భూసారం పెంచుకొనేందుకు ప్రత్యామ్నాయంగా పచ్చిరొట్ట సాగు చేయాలని సూచిస్తున్నారు. జీలుగ, జనుము, పెసర, పిల్లి పెసర, అలసంద వంటివి ప్రధాన పంటల సాగుకు ముందు పొలంలో పండించి.. తరువాత కలియదున్నడం ద్వారా ఎంతో మేలు జరుగుతుందని చెబుతున్నారు. ఫలితంగా రసాయన ఎరువుల వాడకం తగ్గడంతో పాటు వాటి కోసం అయ్యే ఖర్చు.. పంట నాణ్యత తదితర ఎన్నో లాభాలు పొందవచ్చని పేర్కొంటున్నారు. ఈ పద్ధతిలో జీలుగ, జనుము, పెసర, పిల్లి పెసర వంటి వాటిని మొగ్గ దశ వరకు పెంచి భూమిలో కలియ దున్నుతారు. సాధారణంగా ఇవి పూత దశకు రావడానికి 40 నుంచి 50 రోజుల సమయం పడుతుంది. ఇవి లెగ్యుం జాతికి చెందినవి కావడంతో నత్రజని స్థాపనకు ఎంతగానో తోడ్పతున్నాయి. వీటితో పంటకు అవసరమైన నత్రజని, భాస్వరం లభిస్తుంది. దీంతో రసాయన ఎరువులు అయిన యూరియా, డీఏపీ తదితరాల వాడకం తగ్గుతుంది. సాధారణంగా మే, జూన్ నెలలో సాగుకు అనుకూలంగా ఉంటుంది. ఇందు కోసం ముందుగా దుక్కిని దున్ని విత్తనాలను చల్లుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో వ్యవసాయ అధికారులు సైతం మండల పరిధిలో రైతులకు సూచనలు చేస్తున్నారు. పచ్చిరొట్ట సాగు చేసి ప్రయోజం పొందాలని చెబుతున్నారు.


నెల్లికొండిలో జీలుగ విత్తనాలు చల్లుతున్న రైతు

సబ్సిడీపై విత్తనాలు

ప్రభుత్వం సైతం సేంద్రియ ఎరువుల వాడకాన్ని పోత్సహించడం కోసం పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీపై సరఫరా చేస్తోంది. మండల పరిధిలో అప్పంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం, చిన్నచింతకుంట రైతు అగ్రోసేవ కేంద్రాల ద్వారా పంపిణీ మొదలైంది. కాగా జీనుగ బస్తాకు రూ. 1,116, జనుము బస్తాకు రూ. 1448 చెల్లించి రైతులు విత్తనాలు తీసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్‌ను ఇవ్వాల్సి ఉంటుందని సూచిస్తున్నారు. రైతులు సద్వినియోగం చేసుకుని సేంద్రియ పంటల సాగుకు శ్రీకారం చుట్టాలని పేర్కొంటున్నారు.

పచ్చిరొట్టతో మేలు

పచ్చిరొట్ట సాగుతో భూమి సారవంతంగా అవుతుంది. సాగు చేసిన పంటలకు సేంద్రియ ఎరువులతో పాటు నత్రజని అందిస్తుంది. దీంతో పంటలు సంపూర్ణ ఆరోగ్యంగా ఎదిగి అధిక దిగుబడులు వస్తాయి. అంతేకాకుండా రసాయన ఎరువులు వాడకం, వాటికోసం అయ్యే ఖర్చు సైతం తగ్గుతుంది. అందువల్ల రైతులు తప్పనిసరిగా పచ్చిరొట్ట సాగును చేసుకోవాలి.

– మండల వ్యవసాయ అధికారి రాజేష్‌ఖన్న, చిన్నచింతకుంట

కలెక్టర్ ఆదేశాలతో ధాన్యం తరలింపు


వడ్లను దగ్గర ఉండి తరలిస్తున్న తహసీల్దార్ రాజునాయక్

మిడ్జిల్: రాణిపేట్‌లో తడిసిన ధాన్యాన్ని అధికారులు తరలించారు. కాగా ఇటీవల కురిసిన ఆకాల వర్షంతో వరిధాన్యం తడిసిపోగా శుక్రవారం రాణిపేట్‌లో కలెక్టర్ రవినాయక్ తడిసిన ధాన్యంను పరిశీలించారు. రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యంను వెంటనే తరలించాలని మండల అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే శనివారం ఉదయం తహసీల్దార్ రాజునాయక్ పర్యవేక్షణలో సింగిల్‌విండో అధికారులు వడ్లను మొత్తం తూకం వేసి మిల్లులకు తరలించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

చిన్నచింతకుంట: నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని దేవరకద్ర వ్యవసాయ సహాయ సంచాలకులు యశ్వంత్‌రావు అన్నారు. శనివారం మండలంలోని లాల్‌కోట, పర్దిపూరం, వడ్డేమాన్, చింతకుంట గ్రామాలల్లోని విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణదారులు నాణ్యమైన విత్తనాలను రైతులకు విక్రయించాలని సూచించారు. రైతులను మోసం చేసి కల్తీవిత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా విత్తనాలు విక్రయించి తప్పనిసరిగా రైతులకు రశీదులు ఇవ్వాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి రాజేష్‌ఖన్న తదితరులు ఉన్నారు.


చిన్నచింతకుంటలో విత్తనాలను పరిశీలిస్తున్న అధికారులు

విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

అడ్డాకుల: మూసాపేట మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల పేరుతో జరుగుతున్న మౌళిక వసతుల కల్పన పనులను శనివారం అధికారులు పరిశీలించారు. పోల్కంపల్లి, చక్రాపూర్, తాళ్లగడ్డ, సంకలమద్ది, దాసర్‌పల్లి, నందిపేట గ్రామాల్లోని పాఠశాలలను డీఈఈ జి.మనోహర్, ఏఈ ఆర్.శ్రీనివాసులు సందర్శించారు. ఆయా పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను పరిశీలించి పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులతో మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాల నిధులతో చేపట్టిన పనులను త్వరితగతిన పనులను పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. సంపుల నిర్మాణం, విద్యుత్ సౌకర్యానికి సంబంధించిన పనులను పరిశీలించారు.

కోయిల్‌కొండ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో... ఆదర్శపాఠశాలలకు మంజూరైన నిధులతో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పనులు చేపట్టాలని ఎంపీడీఓ కాళప్ప సూచించారు. శనివారం మండలంలోని అనంతపూర్, నల్లవల్లి, ఖాజీపూర్, తిర్మలంపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. పాఠశాలలో విద్యుత్, తాగునీటి వసతి, మరుగుదొడ్లు వంటివి ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. హెచ్ఎం వెంకటాజీ తదితరులు పాల్గొన్నారు.


అనంతపూర్‌లో పనులు పరిశీలిస్తున్న అధికారులు


దాసర్‌పల్లిలో..

వాసవీమాతకు ప్రత్యేక పూజలు


సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

జడ్చర్ల టౌన్: వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి ఉత్సవాలు శనివారం జడ్చర్లలో వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని ఆలయంలో అవోపా ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాలు శనివారం ముగిశాయి. రెండవ రోజు సత్యసాయిసేవాసమితి వారిచే నగరసంకీర్తన, సుప్రభాతసేవలు జరిపించారు. అనంతరం అమ్మవారి మూలవిగ్రహానికి క్షీరాభిషేకం, నవవిధ ఫలరసాభిషేకం జరిపించారు. 10గంటలకు కన్యకాపరమేశ్వరి మాత వ్రతం చేశారు. ఆర్యవైశ్య మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సామూహిక కుంకుమార్చన, వాసవి పారాయణం జరిపించారు. 12.30 గంటలకు డోలాహరణం (తొట్టెల సేవ), వడిబియ్యం, సాయంత్రం 5గంటలకు వాసవీమాత ఊరేగింపు, నందికోళ్లసేవ, గ్రామోత్సవం, మహామంగళహరతి లాంటి విశేష కార్యక్రమాలతో ఉత్సవాలు ముగిశాయి. సాయినగర్ సకలదేవతల ఆలయంలోనూ వాసవీమాత జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, సామూహిక కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేశారు. ఉమెన్స్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

దేవరకద్ర: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం ఘనంగా వాసవీమాత జయంతి వేడుకలను నిర్వహించారు. ఉదయం అమ్మవారికి 108 కలశాలలో తెచ్చిన జలంతో అభిషేకం చేశారు. పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో కార్యక్రమం చేపట్టారు. అనంతరం ప్రత్యేక అలంకారంలో అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించి మహా మంగళ హారతి ఇచ్చారు. సాయంత్రం అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, పల్లకీసేవ నిర్వహించారు.


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


దేవరకద్రలో..

ఆంజనేయస్వామికి పూజలు



కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని ఆది ఆంజనేయస్వామి ఆలయంలో కోయిల్‌కొండ పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు శనివారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నందకిశోర్, ప్రవీణ్, సంతోష్, నరేష, అర్చన, శ్రీనివాసులు, సునీత, మంజుల, చంద్రకాంత్, రఘుమారెడ్డి, రమాకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి ఉత్సవాలు

నవాబుపేట: మండల పరిధిలోని ఇప్పటూర్ గ్రామంలో శనివారం నుంచి శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి ఉత్సవాలు ప్రారంభించినట్లు నిర్వాహకులు నవనీత్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆదివారం హోమం, సోమవారం స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు వివరించారు. పెద్దసంఖ్యంలో పాల్గొనాలని కోరారు.

వీరభద్రుడికి ప్రత్యేక అభిషేకం

నవాబుపేట: మండలపరిధిలోని లోకిరేవు వీరభద్రస్వామి దేవాలయంలో ఉత్సవాలు శనివారం ప్రారంభించారు. సందర్భంగా వీరభద్రుడికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం విశేష అలంకరణ చేపట్టారు. కాగా ఆదివారం అగ్నిగుండ కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి తెలంగాణతో పాటు కర్ణాటక, ఆంధ్ర, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివస్తారని ప్రధాన పూజారి లింగమయ్య, ఉత్సవ నిర్వాహకులు నందీశ్వర్ తెలిపారు.

యువకుడు అదృశ్యం

మహమ్మదాబాద్: మండల కేంద్రానికి చెందిన సజ్జు అనే యువకుడు అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఎస్‌ఐ శేఖర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. సజ్జు ఈ నెల 6న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి రాలేదు. దీంతో అతడి తండ్రి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

రక్తదాన శిబిరం

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం శివారులో ఉన్న స్నేహఫామ్స్‌లో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్ సూచనల మేరకు ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఫామ్స్ మేనేజర్ భాస్కర్ రెడ్డి, యూత్‌రెడ్‌క్రాస్, జూనియర్ రెడ్‌క్రాస్ సమన్వయకర్తలు బాబుల్‌రెడ్డి, అశ్విని, చంద్రశేఖర్, అశోక్‌కుమార్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తలసేమియా బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బాలానగర్: బీఆర్‌ఎస్ యూత్ వింగ్ సుప్ప ప్రకాష్ తండ్రి సుప్ప పోచయ్య మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి శుక్రవారం మాచారం గ్రామానికి వచ్చారు. పోచయ్య మృతదేహం వద్ద నివాళి అర్పించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

పీహెచ్‌సీల్లో పారిశుద్ధ్య చర్యలు


మిడ్జిల్‌లో శుభ్రత చర్యలు చేపట్టిన సిబ్బంది


నవాబుపేటలో..

మిడ్జిల్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో వైద్యసిబ్బంది పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలను శుభ్రం చేశారు. చెట్లకు నీరు అందించారు. వైద్యాధికారి శివకాంత్, పార్మసిస్ట్ శివకుమార్, స్టాఫ్ నర్స్ గ్రేస్, సిబ్బంది దేవయ్య, సంపత్, జంగయ్య, గీత తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం వైద్య సిబ్బంది పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలకు నీళ్లు పోశారు. మండల వైద్యాధికారి డాక్టర్ నవీన్‌చంద్ర, శ్రీనివాస్, శరభలింగం, రాఘవేందర్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆరాధన మహోత్సవాలు


భజన పోటీల్లో న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన వారికి సన్మానించిన సభ్యులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం తెలంగాణ చౌరస్తాలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో జరుగుతున్న స్వామివారి ఆరాధన గురుపూజా మహోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణ స్వర్ణకారుల సంఘం తరపున స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం భక్తులు అన్నప్రసాద వితరణ చేశారు. రెండురోజులపాటు నిర్వహించిన భజన పోటీల్లో శ్రీవీరాంజనేయస్వామి భజన మండలి (గురుకుంట) ప్రథమ, శ్రీరాజరాజేశ్వరి భజన మండలి (మహబూబ్‌నగర్) ద్వితీయ, శ్రీశివరామాంజనేయ భజన మండలి (బోయపల్లి) తృతీయ స్థానాల్లో నిలిచాయి. దుర్గామహిళా భజన మండలి (మహ్మదాబాద్), శ్రీశివాంజనేయ భజన మండలి (కొండాపూర్) ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. అదేవిధంగా ఉత్తమ హార్మోనియంగా రాంచంద్రయ్య (బోయపల్లి), ఉత్తమ గాయకుడు నాగభూషణం (నవాబ్‌పేట), ఉత్తమ తబల బాల్‌రాజు (మహబూబ్‌నగర్) నిలిచారు. గెలుపొందిన వారికి నగదు బహుమతులు, ప్రశంసపత్రాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో దేవస్థానం అభివద్ధి కమిటీ చైర్మన్ వడ్ల శేఖరాచారి, ప్రధాన కార్యదర్శి వి.నారాయణ, కోశాధికారి నారాయణ, జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం మాజీ అధ్యక్షుడు మణికొండ నర్సింహాచారి, విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం అధ్యక్షుడు సత్యయ్యాచారి తదితరులు పాల్గొన్నారు.

నాటక రంగ పరిరక్షణ కళాకారుల బాధ్యత


కళాకారులతో బి.శివకుమార్

జడ్చర్ల టౌన్: నాటక రంగ పరిరక్షణ అనేది కళాకారులతో పాటు ప్రజలందరి బాధ్యత అని రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బి. శివకుమార్ అన్నారు. శుక్రవారం రాత్రి బూర్గుపల్లిలో శ్రీకృష్ణ కళామండలి గ్రామకమిటీ అధ్యక్షుడు గోరంట్ల మల్లేష్ అధ్యక్షతన చిరుతల శ్రీ మార్కాండేయ విలాసం నాటక ప్రదర్శన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. టీవీసీరియల్స్, సామాజిక మాధ్యమాలు ప్రజాజీవితంలో ఒక భాగం అయ్యాయని, ప్రాచీన కళలు అంతరించిపోతున్న తరుణంలో గ్రామీణ జానపద కళలకు ఊపిరి పోస్తున్నందుకు కళామండలిని అభినందించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో నాటకాన్ని తిలకించడానికి తరలివచ్చారు. బీసీసేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్, కళామండలి సభ్యులు కృష్ణకుమార్, గొడుగు శంకరయ్య, పెద్ద నర్సింహులు, రామకొండ, వెంకటేశ్‌లు పాల్గొన్నారు.


నాటకాన్ని తిలకిస్తున్న బూర్గుపల్లి గ్రామస్తులు

భారీవర్షంతో రోడ్డుపై నిలిచిన నీరు


భూత్పూర్‌లో చౌరస్తాలో రహదారిపై నిలిచిన వర్షం నీరు

భూత్పూర్: పట్టణంలో శనివారం సాయంత్రం కురిసిన భారీవర్షంతో చౌరస్తాలోని నలువైపుల రహదారులపై నీరు నిలిచింది. దీంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. ఇదిలా ఉండగా చౌరస్తాలోని మహబూబ్‌నగర్ వెళ్లే దారిలో దాదాపు రూ. కోటితో రహదారికి ఇరువైపులా నీరు వెళ్లేందుకు డ్రెయినేజీ నిర్మించినా వర్షం వచ్చినప్పుడు ఇబ్బందులు తప్పడం లేదని పలువురు వాపోతున్నారు. అప్పట్లో డ్రెయినేజీ దాటి రహదారిపై వ్యాపారస్తులు ఎలాంటి వస్తువులు వేయరాదని మున్సిపల్ అధికారులు ఆదేశాలు జారీ చేశారని.. కానీ వాటిని ఎవరూ పాటించడం లేదని చెబుతున్నారు. కొన్ని నెలల తర్వాత తిరిగి డ్రెయినేజీ దాటి రహదారిపై వ్యాపారస్తులు మెట్లు నిర్మించడం, మట్టి వేయడంతో.. వర్షం నీరు డ్రెయినేజీకి వెళ్లకుండా రోడ్డుపై నిలుస్తోందని అంటున్నారు. దీంతో ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు చొరవ తీసుకొని శాశ్వత పరిష్కారం చూపాలని పలువురు కోరుతున్నారు.

రాజాపూర్: మండల కేంద్రంతో పాటు తిరుమలాపూర్, కుచ్చర్‌కల్, రాయపల్లి తదితర గ్రామాల్లో శనివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో రైతులు తమ పొలాలను దుక్కి దున్నేందుకు సిద్ధం అవుతున్నారు. అంతేకాకుండా రైతులు సర్వీస్‌రోడ్లపై ఆరబోసుకున్న వరిధాన్యం తడిసింది.

బాలానగర్: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో శనివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో వేసవి నేపథ్యంలో దంచి కొట్టిన ఎండల నుంచి ఉపశమనం లభించినట్లైంది. కాగా ఆయా గ్రామాల రైతులు పొలాలను సిద్ధం చేసుకునేందుకు సమాయత్తం అవుతున్నారు. పొలాలను దున్నేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

